

# గుడ్ బై డియర్స్

సిద్ధార్థ

జమ్ము-తావి ఎక్స్‌ప్రెస్ "దడ" "దడ" లాడుతూ వచ్చి ఆగింది. ఇక ప్లాట్ ఫారం మీద జరిగే హడావుడి ఇప్పటికే చాలాసార్లు చదివేసి వుంటారు.

మిలి తన మిత్రబృందం ఓ నలుగురితో కలసి హడావుడిగా ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ కోసం వెతుకుతోంది మొత్తం అయిదుగురు అమ్మాయిలు జీన్స్ డ్రెస్ వేసుకుని ఉన్నారు. హైహీల్స్ టకటకలు పాప్ మ్యూజిక్‌తో పోటీ పడుతున్నట్లుగా వున్నాయి. అలాంటి వాళ్ళని మా విజయవాడ విద్యార్థులు ముద్దుగా క్యాట్స్ (పిల్లులు) అని పిలుచుకుంటారు.

మిలి ముక్కు మీదకు జారిపోతున్న కళ్ళజోడు సరిచేసుకుంటూ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ వెతికి పట్టుకుని "ఐ గాట్ ఇట్" అంటూ అరిచింది.

పెట్టెబేడా అన్నీ సర్దేసి కంపార్ట్‌మెంట్ తలుపు దగ్గర నిలబడి ఎడతెగని వాగ్ధోరణిలో మునిగిపోయారు.

ఇంతలో "అడుగోనే! మొన్న ఎగ్జిబిషన్‌లో మనల్ని అల్లరిచేసి అవమానకరంగా ప్రవర్తించిన బృందంలోని ఓ కుడుడు. ఇటువేపే వస్తున్నాడు" అంది క్యాట్స్‌మంద లోని ఓ సుందరి.

దీపక్ క్యాట్స్ మందని చూసి ఉలిక్కిపడిపోయాడు. ఇక తనపని తిరపతి కొండైపోయిందనుకొని మనసులో కడవపోతగా బాధపడిపోయాడు ఎందుకంటే అతనిదీ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటే. వాళ్ళు ఐదుగురు. తను ఒక్కడు.

క్యాట్స్ అతనికి దారివ్వకుండా అడ్డంగా నిలబడ్డారు. దీపక్ వాళ్ళకేసి నిస్సహాయంగా చూశాడు. అంతా తప్పుకొని లయబద్ధంగా క్లాప్స్ కొడుతూ అతన్ని లోపలికి ఆహ్వానించారు.

దీపక్ ఇక అప్పటికి జీవితంమీద ఆశ వదిలేసుకున్నాడు. అతని పెట్టె, బెడ్డింగ్ నెమ్మదిగా ఓమూలకు చేర్చి మూగగా చూస్తూ కూర్చుండిపోయాడు.

కొంతసేపు గడిచింది. సన్‌డే పుస్తకం తీసి చదవటం మొదలుపెట్టాడు.

"తమ పేరు సెలవిస్తారా కాస్త" అంటూ వ్యంగ్యంగా అడిగింది మిలి.

ఈ లోపల మందలోని మరో సుందరి "హాచ్చ్" అంటూ తుమ్మింది.

దీపక్ కంగారుగా చేతిలో పుస్తకం వదిలేశాడు.

అంతా కోరస్‌గా "అయ్యయ్యో" అంటూ దీర్ఘం తీశారు.

దీపక్ ధైర్యం తెచ్చుకొని పెన్ను తీసి పుస్తకంమీద "నా పేరు దీపక్. నేను మూగవాడిని. మాటలురావు" అని రాసి వాళ్ళకి చూపించాడు.

మిలి బృందం ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. అతనికేసి జాలిగా చూసి "మేము తొందరపడి మిమ్మల్ని నిందించాము. మా తప్పుకు క్షమించండి. ఆరోజు ఆ బృందంలో మిమ్మల్ని చూశాం కానీ మీరేమీ అనలేదని గుర్తించలేదు వీ ఆర్ వెరీసారీ" అన్నారు.

దీపక్ దిగవలసిన స్టేషన్ వచ్చేదాకా అతనికి చాలా మర్యాద పూర్వకమైన కంపెనీ ఇచ్చారు. అనేక సంజ్ఞలతో అతనితో మాట్లాడి చాలా ఆనందపడిపోయారు. మధ్య మధ్య స్టేషన్లో కూల్‌డ్రింక్స్ కూడా ఇప్పించారు.

దీపక్ పేపర్‌మీద "ఇలాంటివి నేను చెయ్యాలి. మీరు చెయ్యటం నాకేం నచ్చలేదు" అని వ్రాశాడు.

కాని అతని రాతలను ఎవ్వరూ పట్టించుకోలేదు. చివరికి దీపక్ తను దిగాల్సిన స్టేషన్ వచ్చేసరికి పెట్టె. బెడ్డింగ్ పుచ్చుకొని రైలు దిగి కిటికీ దగ్గరకు వచ్చాడు.

క్యాట్స్ బృందం అతనికేసి వీడ్కోలుగా చూశారు.

దీపక్ చిన్నగా నవ్వి "థాంక్యూ వర్ యువర్ కంపెనీ మైడియర్ పూర్ క్యాట్స్. గుడ్‌బై" అని వడివడిగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

మిలీ బృందం కిటికీలోంచి తలలు బైటపెట్టి దిమ్మెరపోయి చూస్తూండిపోయారు.

*